క్లుప్తంగా

బోధన్‌లో హోటళ్ల తనిఖీ



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని హోటళ్లను, ప్రైవేట్ ఆస్పత్రులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తనిఖీ చేశారు. పట్టణంలోని వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. హోటళ్ల యజమానులు పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రమైన ఆహారపదార్థాలను ఉపయోగించాలని, ఈసూచనలు పాటించకపోతే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ శివారులో గల బ్లూమింగ్ బడ్స్ పాఠశాలకు చెందిన వి అఖిల్‌చారి జూనియర్ విభాగంలో జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ప్రసన్నకుమారి తెలిపారు. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి అఖిల్‌చారిని అభినందించారు. ఆగస్టు 4, 8 తేదీలలో బెంగళూరులో జరిగే జాతీయస్థాయి జూనియర్ విభాగం స్విమ్మింగ్ పోటీల్లో అఖిల్‌చారి పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు.

31న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలి రావాలి



బోధన్: కార్మికులకు కనీస వేతనాల సవరణ చేపట్టాలని టీయూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బీ.మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం ఎడపల్లి మండలంలోని ఠానకలాన్ గ్రామంలో బీడి కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కనీస వేతన సవరణ ,ఇతర డిమాండ్లతో ఈ నెల 31న జిల్లా కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు అన్నీ రంగాల కార్మికులు తరలి రావాలని పిలుపు నిచ్చారు. బీడీ కార్మికులు సావిత్రి, సవిత, లక్ష్మి, గంగామణి, సునంద, సౌమ్య, అనురాధ, లావణ్య, పార్వతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలు



ఆర్మూర్: కనీస వేతనాల అమలును డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) పిలుపునిచ్చిందని నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తెన్న, ఆర్.రమేష్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ లోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు పని గంటల పెంపును వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 31న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి కార్మికులంతా ఏకమై ఆందోళనకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజేశ్వర్, ప్రకాష్, సహాయ కార్యదర్శి సత్తెమ్మ, జిల్లా కోశాధికారి అరవింద్, నాయకులు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



ఆర్మూర్‌టౌన్ : వనమహోత్సవంలో ప్రజలకు అందించిన మొక్కలను నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 3వ, 4వ వార్డులో మొక్కలు పంపిణీ కార్యాక్రమం నిర్వహించారు. దీంతో పాటు 100 రోజుల కార్యచరణలో భాగంగా 12వ, 29వ వార్డులో మున్సిపల్‌శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డ్రై డే కార్యక్రమం చేపట్టారు. అనంతరం పెర్కిట్‌లోని బస్తీ దవాఖానను సందర్శించి రోగుల వివరాలను, మందుల గురించి వైద్య సిబ్బందినికి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరి ఎస్సై సురేష్, పర్యవరణ ఇంజినీర్ పూర్ణమౌళి, ఆర్పీలు, మున్సిపల్ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ టిప్పర్ పట్టివేత

రుద్రూర్ : కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా శుక్రవారం ఎలాంటి పత్రాలు లేని ఖాళీ టిప్పర్ పట్టుబడినట్టు ఎస్సై సునీల్ తెలిపారు. డ్రైవర్ వాహనానికి సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్టు ఎస్సై తెలిపారు.

కంట్రోల్ రూమ్@24/7

- వర్షాల నేపథ్యంలో సత్వరమే స్పందించేలా ఆర్మూర్ మున్సిపాలిటీలో ఏర్పాటు
- శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించాలని కమిషనర్ ఆదేశం

ఆర్మూర్‌టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో 24గంటల పనిచేసే కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా మున్సిపల్ పరమైన మురికినీటి కాలువలు, నీటి నిల్వలు, వీధి దీపాల నిర్వహణ, చెట్లు విరిగి పడటం, శిథిలావస్థకు చేరిన ఇళ్ల సమాచారం అందించడానికి వీలుగా కంట్రోల్ రూమ్ ప్రజలుకు అందుబాటులో ఉంటారు. పారిశుధ్య సమస్యలు వంటి వాటిపై సత్వరమే స్పందించుటకు కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లలకు ప్రజలు సమాచారం అందించవచ్చు. వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలోని ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి.



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటైన కంట్రోల్ రూమ్

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అధికారులను ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ నెంబర్‌లు

అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఉదయం 9 గంటల వరకు	
వి.మోహన్, జూనియర్ అసిస్టెంట్	9948027506
ఎంసురేష్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది	6301799590
ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు	
జె సురేందర్, జూనియర్ అసిస్టెంట్	9963175237
జి.అశోక్, జూనియర్ అసిస్టెంట్	9985265989
సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు	
అబ్దుల్ సలీం, సీనియర్ అసిస్టెంట్	9396282202
అబ్రార్, ఔట్ సోర్సింగ్,	7013560663

సమస్య తలెత్తితే సమాచారం ఇవ్వాలి



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణంలోని 36 వార్డులలో సమస్యలు తలెత్తితే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలి. వెంటనే మున్సిపల్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని సమస్యలను పరిష్కరిస్తారు. వర్షాల కురుస్తుండంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

గ్రామ దేవతలకు జలాభిషేకం

రెంజల్(బోధన్) వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని కళ్యాపూర్ గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. మండలంలోని తాడ్‌బిలోలి గోదావరి రేవు వద్దకు గ్రామస్తులు కాలి నడకన తరలివెళ్లారు. గోదావరి జలాలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో తీసుకవచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవతలను ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గాండ్ల నాగరాజు, కమిటీ ప్రతినిధులు కిన్నెర మోహన్, శంకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



గంగాజలాన్ని తీసుకొస్తున్న కళ్యాపూర్ వాసులు

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



డొంకేశ్వర్(ఆర్మూర్): సహకార బ్యాంకు మేనేజర్‌గా పని చేసి బదిలీపై వెళ్తున్న రాధను డొంకేశ్వర్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. నాలుగేళ్లుగా మేనేజర్‌గా పని చేసి రైతులకు అందించిన సేవలను చైర్మన్ భరత్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా జ్ఞాపికను బహూకరించారు. వైస్ చైర్మన్ మోర్తాడ్ ముత్యం, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్ రెడ్డి, రైతులు ఉన్నారు.

ఆనందంతో.. పాలాభిషేకం



కిసాన్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు బూస లక్ష్మికి మొదటి విడతగా రూ.లక్ష ఖాతాలో జమైంది. దీంతో శుక్రవారం ఆమె తన ఇంటి నిర్మాణం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. తనఖాతాలో నగదు జమ కావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో నాయకులు కపిల్, గంగాధర్ తదితరులున్నారు.

అభిమానంతో.. జై రేవంతన్న



వరి నారుతో 'జై రేవంతన్న' అక్షరాలు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వరికి రూ. 500 బోనస్ చెల్లిస్తుండడంతో ఓ అభిమాని 'జై రేవంతన్న' పేరుతో తన పొలంలో వరి తూకం వేసి సీఎం రేవంత్‌రెడ్డిపై అభిమానాన్ని చాటుకున్నాడు. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పీర్ల అరవింద్ యాదవ్ అనే రైతు తన పొలంలో కొంత మేర స్థలం వదిలి 'జై రేవంతన్న' పేరుతో తూకం వేశాడు. వరి నాట్లు మొదలు కావడంతో తూకాన్ని అలాగే ఉంచి అలాగే సాగు చేస్తానన్నాడు. గతేడాది వానాకాలంలో 48 క్వింటాళ్లకు రూ.24వేలు జమయ్యాయని, ఈవానకాలంలో సాగు విస్తీర్ణాన్ని పెంచానని రైతు తెలిపాడు.

కానరాని డ్రైయినేజీలు, సీసీ రోడ్లు

- బోధన్ మున్సిపాలిటీలో పలు కాలనీల్లో ఇళ్ల మధ్య నిలుస్తోన్న మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వినతి

బోధన్‌టౌన్(బోధన్): బల్దియాలో 38 వార్డుల్లో 10 వార్డులకు పైగా డ్రైయినేజీలు, రోడ్లు లేని కాలనీలు ఉన్నాయి. వర్షాకాలంలో మురుగు నీరు ఇళ్ల మధ్య నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద నెలకొంది. ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. పారిశుధ్య నిర్వహణపై బల్దియా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. బల్దియాలో పర్మినెంట్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిన 184 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. 38వార్డులను పారిశుధ్య నిర్వహణ కోసం 9 జోన్‌లుగా విభజించి జోన్‌కు ఒక జవాన్‌ను నియమించారు. పారిశుధ్య నిర్వహణ కోసం 13 ట్రాక్టర్‌లు, 24 ఆటోలు ఉన్నాయి. ప్రతిరోజు 28 నుంచి 34 టన్నుల చెత్తను సిబ్బంది సేకరిస్తున్నారు.

శివారు కాలనీల్లో ...

పట్టణంలోని శివారు కాలనీలైన వినాయక్ నగర్, గౌడ్స్ కాలనీ, ప్రేస్ కాలనీతో పాటు విలీన గ్రామాలైన నర్సాపూర్, ఆచన్‌పల్లి, చెక్కిక్యాంప్, ఆటో నగర్, శ్రీనివాస క్యాంపుల్లో రోడ్లు, డ్రైయినేజీలు కానరావు. వర్షాకాలంలో మట్టి రోడ్లపై నీరు నిలిచి బురద మయంగా మారుతోంది. సమస్యను పరిష్కరించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బల్దియా అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపడంతో పాటు డ్రైయినేజీలను, రోడ్లు నిర్మించాలని శివారు కాలనీ ప్రజలు కోరుతున్నారు.



సరస్వతినగర్ కాలనీలో నిలిచిన మురుగు

చర్యలు తీసుకుంటాం

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. డ్రైయినేజీలు లేని వార్డులను గుర్తించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరైనప్పుడు డ్రైయినేజీలు, రోడ్లు నిర్మిస్తాం.

– జాదవ్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్

యూరియా కొరత లేదు

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ అన్నారు. మండలంలోని రెంజర్ల సహకార సంఘం లో శుక్రవారం యూరియా ఎరువులను పరిశీలించారు. సహకారసంఘ పరిధిలో ఇప్పటి వరకు 440 మెట్రిక్ టన్నులు, వేంపల్లి సహకార సంఘం పరిధిలో 200 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందన్నారు. రెంజర్ల సహకార సంఘంలో మరో 40 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దన్నారు.



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏవో

సంక్షిప్తం

27న బంజారాల ఆత్మీయ సమ్మేళనం

మాక్లూర్: బంజారాల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేనావత్ శ్రీహరి నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజామాబాద్ శివారులోని బృందావన్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో ఒకరి అరెస్ట్

మాక్లూర్: సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో ఈ నెల 24న జరిగిన సంతలో నిందితుడు ఒకరి జేబులో నుంచి సెల్‌ఫోన్‌ను చోరీ చేస్తుండగా పట్టుకున్నారు. అతడిని విచారించగా ఒడిశా రాష్ట్రానికి చెందిన దస్మానియా రంగప్రధాన్‌గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. ప్రతి గురువారం జరిగే సంతలో సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నట్టు సమాచారం ఇవ్వడంతో నిఘా పెట్టి పట్టుకున్నట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై వెల్లడించారు.

వైద్య ఖర్చులకు సహాయం అందజేత

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన టికాయి బాలేష్ కూతురు టికాయి అద్విక కిడ్నీలు చెడిపోయి నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. వైద్య ఖర్చుల కోసం స్థానిక హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వారు శుక్రవారం వారి కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. అద్వికకు పూర్తిస్థాయి వైద్యం కోసం రూ. 10 లక్షలు అవసరం కాగా, కుటుంబీకులు రూ. 5లక్షలు ఖర్చు చేశారని, దాతలు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బొప్పాపూర్ వాగు

రుద్రూర్: వర్షాలతో ఎగువప్రాంతం నుంచి వరద రావడంతో మండలంలోని బొప్పాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం బొప్పాపూర్–రుద్రూర్ లోలెవల్ బ్రిడ్జికి సమాంతరంగా వాగు ప్రవహిస్తుండటంతో సమాచారం అందుకున్న రుద్రూర్ ఎస్సై సాయన్న వాగు ఉధృతిని పరిశీలించారు. రాత్రి వరకు రోడ్డు పైనుంచి వరద నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున ఈ రహదారి ద్వారా వచ్చే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రివేళ వాగు వైపు వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ విషయమై బొప్పాపూర్, రుద్రూర్ జీపీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పెర్కిట్(ఆర్మూర్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. కార్యకర్తలు వ్యక్తిగత అభిప్రాయాలు పక్కనబెట్టి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుర శ్రీకాంత్, మారంపల్లి గంగాధర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, కొత్తూర్ గంగాధర్, డాక్టర్ అరుణ్, హర్ష హరీష్, రామ్ రెడ్డి, ఎం శ్రావణ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ఆలూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల పేరుతో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో శివాజీ, ఎంపీవో శ్రీనివాస్, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజ గంగారాం, ఏపీవో సురేష్, నాయకులు యాల్ల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యేకు వినతి

మాక్లూర్: మండలంలోని 63వ జాతీయ రహదారి అర్బన్ పార్కు, చిన్నాపూర్ కమాన్ నుంచి ఆలూర్ వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ బీటీని డబుల్ బీటీ రోడ్డుగా మార్చాలని అంకాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో పైడి రాకేశ్‌రెడ్డికి బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రళయ్‌తేజ్ గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందించారు. గ్రామంలో డ్రైయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లుకు నిధులు ఇప్పించాలని, నిజామాబాద్ నుంచి కల్లెడి ద్వారా నందిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆలూర్ మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు భరత్, మహేష్, అశోక్, శ్రావణ్య, అరుణ్, మోహన్, సాయిలు, హరీష్ కల్లెడి గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న ప్రళయ్‌తేజ్

పిల్లలకు ఇలాగే భోజనం పెడతారా?

ఆర్మూర్ మండలం పిప్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎండీఎం నిర్వహణను ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి పరిశీలించారు. పాఠశాలలో ఉడికీ ఉడకని పప్పుతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు అయితే ఇలాగే భోజనాన్ని పెడతారా అన్ని హెచ్‌ఎం విశ్వనాథ్‌ను నిలదీశారు. ఎండీఎం నిర్వహణను నిత్యం పర్యవేక్షిస్తూ నాణ్యమైన భోజనం అందేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అలాగే పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి కృషి చేయాలని హెచ్‌ఎం ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వినతి పత్రం అంజదేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసీ ముత్తెన్న, ఉపాధ్యాయులు, పీఎస్ హెచ్‌ఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నీరు.. రోడ్డును తవ్విన అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని అనిల్ టాకీస్ చౌరస్తాలో గల శర్బతీకెనాల్‌పై గల రోడ్డును శుక్రవారం బల్దియా అధికారులు జేసీబీతో తవ్వారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి శర్బతీ కెనాల్లో చెత్తాచెదారం నిలిచి వెంకటేశ్వర కాలనీలో నీళ్లు నిలిచాయి. దీంతో బల్దియా అధికారులు జేసీబీతో తవ్వి కెనాల్ పైప్‌లను తొలగించి చెత్త చెదారాన్ని తొలగించారు.

టెండరైనా ప్రారంభం కాని కల్వర్టు పనులు

పట్టణంలోని శర్బతీకెనాల్‌పై గల కల్వర్టు నిర్మించాలని గడిచిన 6 నెలల క్రితం టెండర్ ప్రక్రియ పూర్తయింది. సదరు కాంట్రాక్టరు ఇంకా పనులు ప్రారంభించలేదు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



శర్బతీకెనాల్ రోడ్డును జేసీబీతో తవ్విస్తున్న అధికారులు

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



రెంజల్(బోధన్): గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. మండలంలోని కందకుర్తి గ్రామంలో శుక్రవారం సీసీ కెమెరాల వినియోగం పై మసీదు కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు అందిస్తున్న సమాచారాన్ని గ్రామస్తులకు వివరించారు. గ్రామస్తులు విరాళాలు పోగు చేసుకుని గ్రామాల్లో సీసీ కెమెరాలను బిగించుకునాలని సూచించారు.

తండ్రి పేరుపై సేవలు ఆదర్శం

పెర్కిట్(ఆర్మూర్) : చేపూర్ గ్రామానికి చెందిన డీఎస్పీ రాజా గంగారాం, హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ సోదరులు తండ్రి పేరుపై సేవలు చేస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో మీసుగు లస్మన్న 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు డీఎస్పీ రాజ గంగారాం, హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.35 వేల విలువ గల టీషర్టులు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కుమారులు తండ్రి త్యాగాలను మరవకుండా ఆయన పేరుపై సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చేతన కుమారి, ఉపాధ్యాయులు రవి, గంగాధర్, చంద్రకళ, గీతాంజలి, మాజీ సర్పంచ్ ఇందూర్ సాయన్న, సమాజ సేవకుడు గడ్డమీది లింగం గౌడ్, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు సారంగి శ్రీకాంత్, మాజీ ఉప సర్పంచ్ డిష్ రాజు, డాక్టర్ శంకర్ దాస్, చిట్యాల పోశెట్టి, గ్రామ యువకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు టీ షర్టులను అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

భవన నిర్మాణానికి భూమి పూజ



బాల్కొండ : ముప్కాల్ మండల కేంద్రంలోని దుర్గామాత అసోసియేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం అసోసియేషన్ సభ్యులు భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం తరుపున రూ.10 లక్షల నిధుల మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బెంచీల పంపిణీ

బోధన్ టౌన్ : పట్టణంలోని నర్సాపూర్ పాఠశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్ భవాని ఆధ్వర్యంలో రూ. 21 వేల విలువగల 40 బెంచీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణంలోని నర్సాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బెంచీలు లేకపోవడంతో వీర వెంకట రఘు ప్రసాద్ బెంచీలు అందిస్తానని ముందుకు వచ్చారని తెలిపారు. ట్విన్నింగ్ ప్రోగాం జిల్లా కార్యదర్శి కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని అధ్యక్షులు ఘనపురం అశోక్, కార్యదర్శి సాయిబాబ, కోశాధికారి బర్ల మధుకర్, హెచ్‌ఎం తదితరులున్నారు.

యూరియా ముందస్తుగా నిల్వ చేసుకోవడంతోనే సమస్య



వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలన డ్డుక్కడ సొసైటీ పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన రైతుల్లో కొందరు యాసంగి పంట కోసం ముందస్తుగా నిల్వ చేసుకోవడంతోనే యూరియా దొరకదేమోనన్న భయం రైతుల్లో నెలకొందని మండల వ్యవసాయాధికారి శృతి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె నడ్కుడ సొసైటీని సందర్శించారు. సొసైటీ పరిధిలో 5905 ఎకరాలు సాగవుతుండగా, 650 మెట్రిక్ టన్నుల యూరియా ఈ సీజన్‌కు సరిపోతుందన్నారు. ఇప్పటి దాకా నడ్కుడ సొసైటీ ద్వారా 607 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగినప్పటికీ రైతులు ఇంకా బారులు తీరుతున్నారని పేర్కొన్నారు. రైతులు ముందస్తుగా యూరియా నిల్వ చేసుకోవడం వల్ల నిజంగా అవసరమున్న రైతులకు దొరకడం లేదన్నారు. గురువారం యూరియా కోసం బారులు తీరారని పేర్కొన్నారు. ఇంకా 400 సంచుల యూరియా సొసైటీ గోడౌన్‌లో అందుబాటులో ఉందన్నారు.